జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట





# పోలీసులకు 45 రోజుల
# కరాటే శిక్షణ ప్రారంభం

**– స్వీయ రక్షణతో పాటు శారీరక, మానసిక దృఢత్వం పెంపొందించేందుకు శిక్షణ : ఎస్పీ జానకి**



**మహబూబ్‌నగర్, ఆగస్టు 8 ( ప్రజా జ్యోతి బ్యూరో ):** విధి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనేలా పోలీసు సిబ్బందిని శారీరకంగా, మానసికంగా దృఢంగా తీర్చిదిద్దేందుకు 45 రోజుల కరాటే శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా పోలీసు శాఖ ప్రారంభించింది. శనివారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని కవాతు మైదానంలో జిల్లా ఎస్పీ దరావత్ జానకి శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు సిబ్బంది విధి నిర్వహణలో వివిధ రకాల పరిస్థితులు, సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుందని, అందుకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ శారీరకంగా, మానసికంగా

# ఫ్లైఓవర్, సర్వీస్ రోడ్ల పనులు
# వేగవంతం చేయాలి

**బాలానగర్‌లో నిర్మాణ పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్**



# మల్దకల్ ఆదిశిలా క్షేత్రంలో సప్తాహ భజన ప్రారంభించిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

**సకాలంలో వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలి**



# బాలల హక్కుల పరిరక్షణలో ప్రధానోపాధ్యాయులదే
# కీలక బాధ్యత

**– విద్యార్థుల్లో లింగ సమానత్వం, విలువలు, నైపుణ్యాలను పెంపొందించాలి : జెండర్ అండ్ ఈక్విటీ కోఆర్డినేటర్ అస్రా ఖాద్రి**

**మహబూబ్‌నగర్ ఆగస్టు 8 ( ప్రజాజ్యోతి బ్యూరో ):** బాలల హక్కుల పరిరక్షణతో పాటు విద్యార్థుల్లో లింగ సమానత్వ భావనను పెంపొందించడంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని సమగ్ర శిక్ష జెండర్ అండ్ ఈక్విటీ కోఆర్డినేటర్ అస్రా ఖాద్రి అన్నారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తల్లిదండ్రులతో పాటు పాఠశాల సిబ్బంది కూడా బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆమె సూచించారు.



# శ్రీశైలం జలాశయానికి కొనసాగుతున్న వరద

-కొనసాగుతున్న విద్యుత్ ఉత్పత్తి
-కే.ఎల్.ఐ కాల్వలకు నీటి విడుదల



# మల్దకల్ ఆదిశిలా క్షేత్రంలో సప్తాహ భజన ప్రారంభించిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

మల్దకల్ ఆగస్టు 08(ప్రజా జ్యోతి):మల్దకల్ ఆదిశీలా క్షేత్రంలోని శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో సకాలంలో వర్షాలు కురిసి పంటలు పండి రైతులు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ శనివారం సప్తాహ భజన కార్యక్రమాన్ని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ప్రారంభించారు.ఆలయ వ్యవస్థాపక వంశీయుడు శ్రీ కృష్ణమాన్య పట్వారి ప్రహ్లాదరావు,ఈఓ సత్యచంద్రారెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభ స్వాగతం పలికారు.అనంతరం స్వామివారికి ప్రత్యేక అర్చనలు నిర్వహించి,అఖండ జ్యోతిని వెలిగించి సప్తాహ భజన కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,వరుణదేవుని కరుణ ప్రతి ఒక్కరిపై ఉండాలని,శ్రీ తిమ్మప్ప స్వామి ఆశీస్సులతో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు పండి రైతులు సంతోషంగా ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు.అనంతరం అన్నదాన సత్రంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని



ప్రారంభించారు.తదుపరి చింతలముని దేవాలయ ఆవరణలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు.కార్యక్రమంలో ధీరేంద్రదాస్, మధుసూదనా చారి,రమేష్,సర్పంచ్ చిట్టెమ్మ గోపాల్,పట్వారీ అరవిందరావు, బాబురావు,జమ్ములమ్మ దేవాలయ ఈఓ పురందర్,అన్నదాత నల్లారెడ్డి, చంద్రశేఖర్‌రావు,గడ్డం కృష్ణారెడ్డి,సీతారామ్‌రెడ్డి,పటేల్ ప్రభాకర్‌రెడ్డి,సత్య రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి,బండ్ల రాజశేఖ ర్‌రెడ్డి,విక్రమ్‌సింహారెడ్డి,ఏ క్లాస్‌పురం నాగేశ్వర్‌రెడ్డి,గట్టు విజయ్‌కుమార్,జంబురామన్ గౌడ్,నరేందర్,మధు,పెద్ద పల్లి అజయ్,వెంకటన్న, నారాయణ,సవారన్న,రాముడు,పద్మారెడ్డి,ఆర్యవైశ్య నాయకులు నాగరాజు, శ్రీనివాసులు,హార్మోనిస్ట్ రాఘవేంద్రా చారి,ప్రసాద్,భజన మండలి సభ్యులు,వాల్మీకి పూజారులు పాల్గొన్నారు.

## ఫ్లైఓవర్, సర్వీస్ రోడ్ల పనులు

# వేగవంతం చేయాలి

**మహబూబ్‌నగర్, ఆగస్టు 8 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**
బాలానగర్‌లో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఫ్లైఓవర్, సర్వీస్ రోడ్ల నిర్మాణ పనులను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ శనివారం తనిఖీ చేశారు. అలాగే అంబేద్కర్ విగ్రహానికి సంబంధించిన పనుల పురోగతిని కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనుల ప్రస్తుత స్థితి, పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. నిర్ణీత నాణ్యతా ప్రమాణాల్లో ఎక్కడా రాజీ పడకుండా పనులను వేగవంతం చేసి, ఫ్లైఓవర్, సర్వీస్ రోడ్ల నిర్మాణాన్ని నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు, నిర్మాణ సంస్థల ప్రతినిధులను ఆదేశించారు. పనులు కొనసాగుతున్న సమయంలో సంబంధిత శాఖల మధ్య సమన్వయం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆమోదించిన సాంకేతిక ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నిర్మాణ ప్రాంతాల్లో భద్రతా చర్యలను పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు.ఫ్లైఓవర్, సర్వీస్ రోడ్ల నిర్మాణంతో పాటు ట్రాఫిక్ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. వాహనదారులు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపడుతూ నాణ్యత, భద్రత, ట్రాఫిక్ నియంత్రణకు ప్రాధాన్యం ఇచ్చి పనులను సకాలంలో పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ స్పష్టం చేశారు.

# పోలీసులకు 45 రోజుల కరాటే శిక్షణ ప్రారంభం

దృఢంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. స్వీయ రక్షణ నైపుణ్యాలు పోలీసులకు ఎంతో అవసరమని, ఆపద సమయాల్లో తమను తాము రక్షించుకోవడంతో పాటు అవసరమైన సందర్భాల్లో ఇతరులను రక్షించేందుకు కూడా ఈ శిక్షణ ఉపయోగపడుతుందని తెలిపారు.
కరాటే కేవలం స్వీయ రక్షణకే పరిమితం కాదని, శారీరక దృఢత్వం, మానసిక స్థైర్యం, ఏకాగ్రత, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, త్వరిత నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని పెంపొందిస్తుందని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొనే సమయంలో ఈ నైపుణ్యాలు పోలీసు సిబ్బందికి ఎంతో ఉపయోగపడతాయని అన్నారు.పోలీసులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలని ఎస్పీ సూచించారు. 45 రోజుల శిక్షణలో చురుకుగా పాల్గొని కరాటేలోని మెళకువలను పూర్తిస్థాయిలో నేర్చుకోవాలని కోరారు. క్రమశిక్షణతో శిక్షణ పొందడం ద్వారా శారీరక సామర్థ్యంతో పాటు ఆత్మవిశ్వాసం పెరిగి విధి నిర్వహణలో మరింత సమర్థవంతంగా పనిచేసే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ శిక్షణలో స్వీయ రక్షణ పద్ధతులు, శారీరక దృఢత్వానికి సంబంధించిన వ్యాయామాలు, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే అంశాలతో పాటు ఆపద సమయాల్లో తమను తాము రక్షించుకునే వివిధ కరాటే మెళకువలను పోలీసు సిబ్బందికి నేర్పించనున్నారు. ప్రజల భద్రతలో కీలకపాత్ర పోషించే పోలీసుల శారీరక, మానసిక సామర్థ్యాలను మరింత పెంపొందించడమే శిక్షణ ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, డీఎస్పీ రమణా రెడ్డి, ఆర్ఐలు కృష్ణయ్య, నగేష్, ఆర్ఎస్ఐలు రమేష్, సత్యం, వన్‌టౌన్ ఎస్ఐ వసంతతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీశైలం జలాశయానికి కొనసాగుతున్న వరద

నాగర్ కర్నూల్ : ఆగస్ట్ 09 (ప్రజా జ్యోతి)
శ్రీశైలం జలాషయానికి భారి వరద కొనసాగుతుంది జూరాల జలాశయం నుండి 2,32,308 క్యూసెక్కుల నీరు శ్రీశైలం జలాశయంలోకి వస్తున్నాయి.ఇన్ ఫ్లో 2,32,308 క్యూసెక్కులు, ఔట్ ఫ్లో 66,460 క్యూసెక్కులుగా ఉంది. పూర్తి స్దాయి నీటిమట్టం 885 అడుగులుకాగా ప్రస్తుతం 876.20 అడుగులు,పూర్తి నీటినిల్వ 215.8070 టీఎంసీలు కాగా ప్రస్తుతం 169.4655 టీఎంసీల నీటి నిల్వ ఉండడంతో కుడి ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రాలలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతుందని అధికారులు తెలిపారు.
-కే.ఎల్.ఐ కాలువలకు నీటి విడుదల :--
జూరాల జలాశయం నుంచి శ్రీశైలం జలాశయానికి 2.32 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండడంతో శ్రీశైలం బ్యాక్ వాటర్ లో ఉన్న కె.ఎల్.ఐ లిఫ్ట్ లు ప్రారంభమయ్యాయి,కల్వకుర్తి ఎత్తిపోతల పథకా నికి 133 క్యూసెక్కుల నీటిని అధికారులు లిఫ్ట్ చేస్తుండడంతో ప్రధానకాలువ ద్వారా సాగు నీరు ప్రారంభం అయ్యింది.

# బాలల హక్కుల పరిరక్షణలో ప్రధానోపాధ్యాయులదే కీలక బాధ్యత

మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన ప్రధానోపాధ్యాయుల ఇంటిగ్రేటెడ్ ట్రైనింగ్ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. బాలబాలికలకు చిన్న వయస్సు నుంచే మంచి విలువలు, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతను అలవాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇంట్లో తల్లిదండ్రులు, పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులను సరైన మార్గంలో నడిపిస్తూ వారి భవిష్యత్‌కు బలమైన పునాది వేయాలని కోరారు. ప్రపంచం వేగంగా మారుతున్న నేపథ్యంలో అన్ని రంగాలకు అనుగుణంగా విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. యవ్వన దశలో విద్యార్థులు వివిధ కారణాల వల్ల పక్కదారి పట్టే అవకాశం ఉన్నందున, వారిని ముందుగానే గుర్తించి సన్మార్గంలో నడిపించాల్సిన బాధ్యత పాఠశాల యాజమాన్యంపై ఉందని పేర్కొన్నారు. పాఠశాలల్లో గర్ల్ చైల్డ్ ఎంపవర్‌మెంట్ క్లబ్‌లు, బాయ్స్ చైల్డ్ ఎంపవర్‌మెంట్ క్లబ్‌లను ప్రతి నెలా నిర్వహించాలని సూచించారు. ఈ క్లబ్‌ల ద్వారా విద్యార్థులకు వారి హక్కులు, బాధ్యతలు, లింగ సమానత్వం, వ్యక్తిగత భద్రత, సామాజిక విలువలపై అవగాహన కల్పించాలని అన్నారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అర్థం చేసుకునేందుకు గర్ల్ చైల్డ్, బాయ్స్ చైల్డ్ ఫ్రెండ్లీ టీచర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. విద్యార్థుల సమస్యలను సున్నితంగా అర్థం చేసుకుని వారికి అవసరమైన మార్గదర్శకత్వం, కౌన్సెలింగ్, తగిన సూచనలు అందించాలని పేర్కొన్నారు. రాష్ట్ర విద్యాశాఖ, న్యాయశాఖ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం (ఎంవోయూ) ప్రకారం విద్యార్థులకు న్యాయపరమైన అవగాహన, అవసరమైన సూచనలు, సలహాలు అందించేందుకు జిల్లా న్యాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే సమావేశాలకు చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ తప్పనిసరిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు.విద్యార్థుల విద్యాభివృద్ధితో పాటు వారి వ్యక్తిత్వ వికాసం, హక్కుల పరిరక్షణ, భద్రత, నైతిక విలువలు, నైపుణ్యాల పెంపొందింపునకు అందరూ సమష్టిగా కృషి చేయాలని అస్రా ఖాద్రి కోరారు.

## పండగ సాయన్న పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం

, ప్రజాజ్యోతి: ప్రజల కోసం పోరాడిన ధీరుడు, అణగారిన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేసిన పండగ సాయన్న జయంతి సందర్భంగా వికారాబాద్ జిల్లాలో ఆయన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాధికార పార్టీ వికారాబాద్ జిల్లా



అధ్యక్షుడు, పరిగి నియోజకవర్గ ఇన్‌చార్జ్ గౌస్ పాషా పండగ సాయన్న విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా గౌస్ పాషా మాట్లాడుతూ పండగ సాయన్న ధైర్యసాహసాలు, ప్రజల పట్ల ఆయనకున్న నిబద్ధత, అణగారిన వర్గాల కోసం చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. అన్యాయానికి ఎదురు నిలిచి ప్రజల పక్షాన పోరాడిన పండగ సాయన్న చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు.సమాజంలో సమానత్వం, న్యాయం కోసం పోరాడిన మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గౌస్ పాషా పేర్కొన్నారు. పండగ సాయన్న వంటి మహనీయుల చరిత్రను భావితరాలకు అందించడం ద్వారా వారి పోరాట స్ఫూర్తిని నిలబెట్టాలని అన్నారు.ఈ కార్యక్రమంలో అంజయ్య, అలీతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని పండగ సాయన్నకు ఘనంగా నివాళులర్పించారు.

# పెద్దచింతరేవుల ఆంజనేయస్వామికి పీఠాధిపతుల ప్రత్యేక పూజలు

దరూర్ ఆగస్టు 08(ప్రజా జ్యోతి ప్రతినిధి):మండల పరిధిలోని పెద్దచింతరేవుల గ్రామంలో కృష్ణానది,జూరాల ప్రాజెక్టు సమీపంలో 18వ శతాబ్దంలో వెలసిన శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ఉత్తరాది మఠం పీఠాధిపతులు 1008 విద్యాదేశ తీర్థ శ్రీపాదులు,1008 విద్యారాజేశ్వర తీర్థ శ్రీపాదులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆషాఢ శు క్ల దశమి సందర్భంగా స్వామివారికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి,ప్రత్యేక అలంకరణ,అష్టోత్తర పూజలు,మహామంగళహారతి సమర్పించారు.ఈ సందర్భంగా పీఠాధిపతులు మాట్లాడుతూ,ఆధ్యాత్మికతతో భక్తులకు మానసిక ప్రశాంతత,ఐశ్వర్యం లభిస్తాయని అన్నారు.ఆంజ నేయస్వామిని భక్తిశ్రద్ధలతో పూజించే వారికి ధైర్యం,సాహసం,ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని పేర్కొన్నారు.



పెద్దచింతరేవుల అన్నప్రసాద కమిటీ ఆధ్వర్యంలో స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు అల్పాహారం,అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు.శనివారం నుంచి 56 రోజుల పాటు ఆలయాన్ని సందర్శించే భక్తులకు అల్పాహారం,అన్నప్రసాద వసతి కల్పిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆద్య చక్రవర్తి కేశవాచార్యులు మాట్లాడుతూ,18వ,శతాబ్దంలో వ్యాస శేషదాసుల వారు స్వామివారిని ప్రతిష్ఠించినట్లు తెలిపారు. గురువులను దర్శించి,సేవించి,పూజించడం ద్వారా గురుబలం లభిస్తుందని అన్నారు.కార్యక్రమంలో ఆద్య వామనాచారి,ఆద్య కిష్టాచారి,ఆద్య మద్వాచారి,ఆలయ పూజారులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యా వాలంటీర్లకు ప్రత్యేక శిక్షణ





## 100 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా వాలంటీర్ల సేవలు.. మూడు రోజుల శిక్షణకు శ్రీకారం

**మహబూబ్‌నగర్, ఆగస్టు 8 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**
ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంపొందించే లక్ష్యంతో మహబూబ్‌నగర్ ఫస్ట్ ఆధ్వర్యంలో విద్యా వాలంటీర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఆగస్టు 8, 9, 10 తేదీల్లో మూడు రోజుల పాటు మహబూబ్‌నగర్ ఫస్ట్ శిక్షణ కేంద్రంలో ఈ కార్యక్రమం కొనసాగనుంది. మహబూబ్‌నగర్ నియోజకవర్గంలో గత విద్యా సంవత్సరంలో 35 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రయోగాత్మకంగా అమలు చేసిన విద్యా వాలంటీర్ల వ్యవస్థ ద్వారా విద్యార్థుల హాజరు, అభ్యసన నైపుణ్యాలు మెరుగుపడటంతో పాటు బలహీన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెరిగినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో కార్యక్రమాన్ని విస్తరించి నియోజకవర్గంలోని 100 ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్నారు. విద్యావంతులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించి, ప్రత్యేక ప్రవేశ పరీక్ష నిర్వహించారు. పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి 100 మంది విద్యా వాలంటీర్లను ఎంపిక చేశారు. ఎంపికైన వారికి సమగ్ర శిక్షణ అందించేలా కార్యాచరణ రూపొందించారు. శిక్షణలో బోధనా పద్ధతులు, విద్యార్థుల మానసిక స్థితిని అర్థం చేసుకోవడం, సబ్జెక్టులపై పట్టు పెంపొందించడం, డిజిటల్ లెర్నింగ్ విధానాలు తదితర అంశాలపై నిష్ణాతులైన అధ్యాపకులు శిక్షణ అందిస్తున్నారు. మొదటి రోజు వాలంటీర్లు ఉత్సాహంగా పాల్గొని బోధనా నైపుణ్యాలను అభ్యసించారు. మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్ ఆధ్వర్యంలో కార్యక్రమం కొనసాగుతుండగా, వందేమాతరం ఫౌండేషన్ కోఆర్డినేటర్ రవీందర్ రెడ్డి పర్యవేక్షణలో తొలి రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. తొలి రోజు శిక్షణలో ఉపాధ్యాయులు రజిత, హిమాబిందు, సురేష్ (రా+ు), ముస్తాక్, శ్రీనయ్య, శ్రీకాంత్, సుష్మిత, వెంకటయ్య , సైకాలజిస్ట్ శ్రీనివాస్, ఫస్సియొద్దిన్ తదితరులు పాల్గొని శిక్షణ అందించారు. విద్యా వాలంటీర్ల సేవల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు పేద, గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్య మరింత చేరువయ్యే అవకాశం ఉందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

# శ్రీ శనేశ్వర స్వామికి తిలతైల అభిషేక పూజలు

**నాగర్ కర్నూల్ : ఆగస్ట్ 09 (ప్రజా జ్యోతి)**
శ్రీ పరాభవ నామ సంవత్సరం ఆషాడ మాసం క్రిష్ణ పక్షంనాడు దశమి రోహిణి నక్షత్రము శనివారం బి జినేపల్లి మండలం పరిధిలోని నంది వడ్డేమాన్ గ్రామంలో గల శ్రీశనేశ్వర స్వామికి భక్తులచే శని గ్రహదోష నివారణకు స్వామివారి తిలతైల అభిషేఖాలు భక్తితో జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్ గవ్వమఠం విశ్వనాథ శాస్త్రి మాట్లాడుతూ ఈ మాసంలో స్వామివారిని కొలిచిన స్వామివారు అత్యధిక సంతృప్తి పొంది విశేష ఫలితాన్ని భక్తులకు ఇస్తారని,ప్రతి ఒక్కరు జన్మ రిత్యా,గోచార రీత్యా శనిగ్రహ దోష నివారణ కు స్వామివారిని శక్తిమేరకు పూజించాలన్నారు. అనంతరం ఆలయంలో గోన బుద్ధారెడ్డి కాలంనా టి బ్రహ్మసూత్రం గల పరమశివునికి రుద్రాభిషేక పూజలు,అర్చనలు,దీపారాధన నందీశ్వర స్వామి కి ప్రత్యేక అర్చనపూజలు నిర్వహించి భక్తులకు వేద ఆశీర్వచనం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వెల్దండ గోపాల్ రావు,గ్రామ సర్పంచ్



సుగుణమ్మ,కమిటీ సభ్యులు కెంచె రాజేష్,ప్రభాకర్ ఆచారి,పుల్లయ్య, అడ్వకేట్ వీర శేఖర్ చారి,శ్రీకాంత్ రెడ్డి, ఆలయ అర్చకులు శాంతి కుమార్,ఉమమహేశ్వర్,సిబ్బంది గోపాల్ రెడ్డి భక్తులు పాల్గొన్నారు.

## తిమ్మాజిపేట మండలానికి చేరుకున్న సి.పి.ఐ పాదయాత్ర

**నాగర్ కర్నూల్ : ఆగస్ట్ 09 (ప్రజా జ్యోతి**
సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు మారేడు శివశంకర్ తిమ్మాజిపేట మండల కార్యదర్శి ఖాజా మైనుద్దీన్ సిపిఐ నాయకుల ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర మూడో రోజు (శనివారం) తిమ్మాజిపేట మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి చేరుకున్న అనంతరం రామ్ రెడ్డిపల్లి,కోడిపత్రి,అప్పాజీపల్లి,గుమ్మ కొండకు తిమ్మాజిపేట్ మండల కేంద్రంలోని పెట్రోల్ బంకు,పోలీస్ స్టేషన్ ద్వారా బస్టాండ్,అంబేద్కర్ చౌరస్తాకు వరకు పాదయాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా కేంద్రంలోని బిజెపి ప్రభత్వ ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని దేశ వ్యాప్తంగా అధిక ధరలను నియంత్రించాలని,నిరుద్యోగి యువకుల కు ఉద్యోగం కల్పించి,రైతు లకు గిట్టుబాటు ధర కల్పించాలాన్నారు. అదేవిదంగా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లలో రాజకీయ జోక్యం లేకుండా అసలైన లబ్ధిదారులను గుర్తించి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తిమ్మాజీపేట శాఖ కార్యదర్శి యాదయ్య,హమాలి సంఘం కార్యదర్శి కృష్ణయ్య,బాలకిష్టయ్య,మేకల జంగయ్య, మహేష్,యాదయ్య,వస్పురి శివ,ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షులు మల్లయ్య,కళకారులు పాల్గొన్నారు.



# రేషన్ బియ్యం అక్రమ రవాణా వాహనం పట్టివేత

**-32 బ్యాగుల్లో 15 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం**
**-బొలెరో వాహనం సీజ్ ఓనర్‌పై కేసు నమోదు**



**నాగర్ కర్నూల్ : ఆగస్ట్ 09 (ప్రజా జ్యోతి)**
అచ్చంపేట శివారులో పోలీసుల తనిఖీల్లో రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్న టీఎస్ 31 టీఏ 2726 నెంబర్ గల వాహనాన్ని పోలీసులు పట్టు కుని ఎన్ఫోర్స్మెంట్ డీటీ హేమ్లా నాయక్ సమక్షంలో పంచనామా నిర్వహించి స్వాధీనం చేసుకున్న బియ్యం ఎంఎల్ఎస్ పాయింట్ గోదాంకు తరలించారు. అనంతరం డ్రైవర్ కం ఓనర్ తిక్కల శ్రీకాంత్‌పై కేసు నమోదు చేసారు. ఇదే బొలెరో వాహనంపై గతంలోనూ రేషన్ బియ్యం కేసు నమోదు చెసా మని మళ్లీ అదే వాహనంలో రేషన్ బియ్యం పట్టు బడటంపై అధికారుల దృష్టికి తెచ్చారు. అచ్చంపేటలో కొనసాగుతున్న రేషన్ బియ్యం అక్రమరవాణాపై విమర్శలు వస్తున్నాయని అక్రమ దందా వెనుక సూత్రధారులను గుర్తించాలని స్థానికుల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి

**జడ్చర్లలో వర్షపు నీటి కాల్వలు, జాతీయ రహదారి, కల్వర్టు పనులను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్**



**మహబూబ్‌నగర్, ఆగస్టు 8 ( ప్రజా జ్యోతి బ్యూరో ):**
జడ్చర్ల మున్సిపాలిటీలో కొనసాగుతున్న వర్షపు నీటి కాల్వలు, జాతీయ రహదారి, కల్వర్టు నిర్మాణ పనులను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శనివారం తనిఖీ చేశారు. ఆయా పనుల పురోగతిని పరిశీలించడంతో పాటు నాణ్యతా ప్రమాణాలను సమీక్షించారు. ఈ సందర్భంగా సంబంధిత మున్సిపల్, ఇంజనీరింగ్ అధికారులతో పనుల వివరాలను అడిగి తెలుసుకున్న అదనపు కలెక్టర్, పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేసి యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత, భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పనులు కొనసాగుతున్న ప్రాంతాల్లో వివిధ శాఖల మధ్య సమన్వయం ఎంతో కీలకమని పేర్కొన్నారు. పనుల కారణంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం, రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ర్దేశించిన గడువులోగా పనులను పూర్తి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టర్ సూచించారు.

# నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే చర్యలు: ట్రాఫిక్ ఎస్ఐ కృష్ణ చైతన్య

**నారాయణపేట ప్రతినిధి ఆగస్టు 08 (ప్రజా జ్యోతి)**

నారాయణపేట: జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనాల తనిఖీలు నిర్వహించి నెంబర్ ప్లేట్ లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతున్న వాహనదారులను గుర్తించి జరిమానాలు విధించారు.అలాగే వెంటనే నెంబర్ పెట్లు వేసుకోవాలని అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ మాట్లాడుతూ.. ప్రతి వాహనానికి నిబంధనల ప్రకారం నెంబర్ ప్లేట్ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడపడం వల్ల వాహనాన్ని గుర్తించడం కష్టమవడంతో పాటు, నేరాలు జరిగిన సందర్భాల్లో దర్యాప్తుకు కూడా ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందన్నారు.

వాహనదారులు తమ వాహనాలకు ప్రామాణికమైన నెంబర్ ప్లేట్లను తప్పనిసరిగా అమర్చుకోవాలని సూచించారు. నెంబర్ ప్లేట్‌ను వక్రీకరించడం, అక్షరాలు లేదా అంకెలను స్పష్టంగా కనిపించకుండా చేయడం, నెంబర్ ప్లేట్ స్థానంలో ఇతర రకాల ప్లేట్లు ఉపయోగించడం వంటి నిబంధనల ఉల్లంఘనలను సహించబోమని స్పష్టం చేశారు.

ట్రాఫిక్ నిబంధనలు ప్రజల భద్రత కోసమే రూపొందించబడ్డాయని, ప్రతి వాహనదారుడు బాధ్యతగా వ్యవహరించి నిబంధనలను పాటించాలని సూచించారు. వాహనం నడిపే సమయంలో డ్రైవింగ్ లైసెన్స్, వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలు, ఇన్సూరెన్స్ తదితర పత్రాలు చెల్లుబాటులో ఉండేలా చూసుకోవాలని తెలిపారు.అలాగే ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లు మరియు ఇతర నాలుగు చక్రాల



వాహనాల్లో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని హెచ్చరించారు.

రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడం ద్వారా తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ప్రమాదం కలిగించే అవకాశం ఉందని ఎస్ఐ కృష్ణ చైతన్య పేర్కొన్నారు. ప్రజలందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని, సురక్షితమైన ప్రయాణానికి బాధ్యతాయుతమైన వాహనదారులుగా వ్యవహరించాలని ఆయన కోరారు.

# చందుముట్ల-గన్యాగుల రోడ్డు మరమ్మత్తులు



**నాగర్ కర్నూలు : ఆగస్ట్ 09 (ప్రజాజ్యోతి)**

నాగర్ కర్నూల్ నియోజకవర్గం లోని చందుభట్ల నుంచి గన్యాకుల గ్రామం వరకు ఉన్న రహదారి గుంతల మయంగా మారడంతో ఈ విషయాన్ని గ్రామ ప్రజలు సర్పంచ్ తిరుపతి గౌడ్ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించిన సర్పంచ్ రోడ్డుపై మొరం పోయించి చదును చేయించారు. దీంతోవాహనదారులు,పాదచరులు,గ్రామస్తులు ఇబ్బందులు తొలడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్,వార్డు సభ్యులు,గ్రామస్తులు పాల్గొన్నారు.

# సర్దార్‌ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



**వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్**

మండల పరిధిలోని కల్వరాల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఎండీ సర్దార్ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి నిమ్స్ ఆసుపత్రికి వెళ్లి ఎండీ సర్దార్‌ను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం వైద్యులను కలిసి సర్దార్‌కు అందుతున్న చికిత్స, ఆరోగ్య పరిస్థితిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎండి నజీర్, రసీదు, ముజీబ్, ఉన్నారు.

# మణికంఠ హాస్పిటల్ లో ఫోటోగ్రాఫర్లకు ఉచిత వైద్య సేవలు

**-జనసేన పార్టీ జిల్లా ఇంచార్జి డాక్టర్ మణికంఠ గౌడ్**





**మక్తల్ నియోజకవర్గ ప్రతినిధి, ఆగస్టు 08 (ప్రజా జ్యోతి):**

మక్తల్ పట్టణంలోని ప్రొఫెషనల్ ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ కుటుంబాలకు మణికంఠ హాస్పిటల్ లో ఉచిత ఓపి వైద్య సేవలు అందిస్తామని హాస్పిటల్ నిర్వాహకులు జనసేన పార్టీ జిల్లా ఇన్చార్జి డాక్టర్ మణికంఠ గౌడ్ వెల్లడించారు. శనివారం రోజు మక్తల్ పట్టణంలోని ఏ ఆర్ ఎం మినీ ఫంక్షన్ హాల్ లో జరిగిన తెలంగాణ ఫోటో వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం కుటుంబ భరోసా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇటీవల ఓ ఫోటోగ్రాఫర్ బైక్ యాక్సిడెంట్ లో కాలు కోల్పోవడంతో ఆ ఫోటోగ్రాఫర్ కు వైద్య ఖర్చులతో పాటు స్కూటి ఇప్పించిన ఆయన తమ మణికంఠ హాస్పిటల్ లో ప్రతి ఫోటో వీడియో గ్రాఫర్స్ కుటుంబ సభ్యులందరికీ ఓపి సేవలతో పాటు స్థానికంగా లభించే టెస్టులను ఉచితంగా అందజేస్తామని డాక్టర్ మణికంఠ గౌడ్ వెల్లడించారు. ఫోటోగ్రాఫర్ల స్థితిగతులు తనకు తెలుసని అంతేకాకుండా ఫోటోగ్రాఫికి ఉన్న ప్రాధాన్యత కూడా తనకు తెలుసు అన్నారు. సమాజంలో ఎక్కడ ఏ సంఘటన జరిగినా ఆ సంఘటనను ఆ దృశ్యాన్ని సజీవంగా నిలపగలిపేది ఒక్క ఫోటోగ్రఫీ మాత్రమేనని అన్నారు. అంతటి చరిత్ర కలిగిన ఫోటోగ్రఫీ రంగంలో పనిచేస్తున్న ఫోటో వీడియో గ్రాఫర్లకు తనవంతు సహకారం అందించాలనే దృక్పథంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన చెప్పారు. ఏ సమయంలోనైనా నా వంతు సహకారం అందించడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని భరోసా ఇచ్చారు .ఈ సందర్భంగా ప్రొఫెషనల్ ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ మక్తల్ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర సంఘం కోశాధికారి మాధవరెడ్డి ఇతర నాయకులు కలిసి డాక్టర్ మణికంఠ గౌడ్ ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక యూనియన్ బాధ్యులు బాలరాజు ,వెంకటేష్, రాజు , కె.పాపిరెడ్డి బి. శ్రీనివాసులు,నెంబర్ తిరుపతి,సస్సార్డీన్, తిరుపతి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ

**మల్దకల్ ఆగస్టు 08(ప్రజా జ్యోతి):**

మల్దకల్ మండల పరిధిలోని తాటికుంట గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ నూతన భవన నిర్మాణ పనులకు శనివారం భూమిపూజ నిర్వహించారు.గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గ్రామ సర్పంచ్ సరోజా నర్సింహులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు,గ్రామ నాయకులు మాట్లాడుతూ,ప్రభుత్వ నిధులతో చేపడుతున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.కార్యక్రమంలో పటేల్ ప్రభాకర్‌రెడ్డి,మాజీ ఎంపీపీ సత్యారెడ్డి,మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి,మాజీ సింగిల్ విండో డైరెక్టర్ భానుప్రకాశ్‌రెడ్డి,సర్పంచ్ సరోజా నర్సింహులు,పాముల రాజు,మాజీ సర్పంచ్ అంజి,మాజీ వార్డు సభ్యులు,ప్రస్తుత వార్డు సభ్యులు,గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



# కోడి పందాల స్థావరాలపై మక్తల్ పోలీసులు దాడులు

**-కోళ్ల పందేలు నిర్వహిస్తున్న ముగ్గురు వ్యక్తుల అరెస్ట్**

**మక్తల్ నియోజకవర్గ ప్రతినిధి, ఆగస్టు 08 (ప్రజా జ్యోతి):**

మక్తల్ స్టేషన్ పరిధిలోని చిట్యాల గ్రామ శివారులో కోడి పందాల స్థావరాలపై మక్తల్ పోలీసులు దాడులు నిర్వహించి కోళ్ల పందేలు నిర్వహిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ రాజు తెలిపారు. శనివారం విశ్వసనీయ సమాచారంతో మక్తల్ ఎస్ఐ రాజు యాదవ్ తన పోలీస్ సిబ్బందితో చిట్యాల గ్రామ శివారులో దాడులు నిర్వహించి అక్రమంగా కోళ్ల పందేలు నిర్వహిస్తున్న ముగ్గురు వ్యక్తులను పట్టుకున్నారు. ఈ సందర్భంగా వారి వద్ద నుండి 5 కోళ్లు,2 మొబైల్ ఫోన్లు,6 ద్విచక్ర వాహనాలు మరియు రూ.4,150/- నగదు స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా కోళ్ల పందేలు నిర్వహించడం ద్వారా ప్రజలను జూదం వైపు ప్రోత్సహించడంతో పాటు శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉన్నందున, ఇటువంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై పోలీసులు నిరంతరం



నిఘా కొనసాగిస్తున్నారు. చట్టవిరుద్ధంగా కోళ్ల పందేలు, జూదం లేదా ఇతర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో ఇలాంటి అక్రమ కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించి, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని పి.రాజు యాదవ్ కోరారు. ఇట్టి దాడులలో హెడ్ కానిస్టేబుల్ బలరాం, కానిస్టేబుల్ మహేష్, హోంగార్డ్ శ్రీహరి పాల్గొన్నారు.

# అభ్యసన సామర్థ్యాల పెంపునకు సమష్టి కృషి చేయాలి

### ఉపాధ్యాయ శిక్షణలో నేర్చుకున్న అంశాలను తరగతి గదుల్లో అమలు చేయాలి : ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్



**మహబూబ్‌నగర్ ఆగస్టు 8 ( ప్రజా జ్యోతి బ్యూరో ):** విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయ శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాఠశాలల్లో సమర్థవంతంగా అమలు చేయాలని ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్ సూచించారు. స్థానిక మోడల్ బేసిక్ హైస్కూల్‌లో నిర్వహించిన ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం ముగింపు సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యా వ్యవస్థలో వేగంగా చోటుచేసుకుంటున్న మార్పులను వివరించిన ఏఎంఓ.. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థుల అభ్యసన స్థాయిని మెరుగుపరిచే దిశగా నిరంతరం కృషి చేయాలని అన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల నమోదును గణనీయంగా పెంచడంతో పాటు మెరుగైన విద్యా ఫలితాలను సాధించడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. ప్రాథమిక దశలోనే విద్యార్థుల అభ్యసన పునాదులు బలంగా ఉండేలా చర్యలు చేపట్టాలని, విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధిలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులతో పాటు ప్రధానోపాధ్యాయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. శిక్షణలో పొందిన జ్ఞానం, నైపుణ్యాలను తరగతి గదుల్లో సమర్థవంతంగా వినియోగిస్తూ ప్రతి విద్యార్థి అభ్యసన స్థాయిని గుర్తించి, అందుకు అనుగుణంగా బోధనా విధానాలను అవలంబించాలని సూచించారు. విద్యార్థుల్లో ప్రాథమిక భాషా, గణిత నైపుణ్యాలను బలోపేతం చేయడం ద్వారా భవిష్యత్ విద్యాభ్యాసానికి పటిష్టమైన పునాది వేయాలని ఆయన ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు నిరంతరం తమ బోధనా పద్ధతులను మెరుగుపరుచుకుంటూ విద్యార్థుల అభ్యసన ఫలితాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జీఈసీఓ అస్రా ఖాద్రి, కోర్స్ డైరెక్టర్ ఎంఏ బాసిత్, జిల్లా వనరుల వ్యక్తులు (డీఆర్‌పీలు) రవి చంచల, రవీందర్, మాధవి, రాఘవేందర్లతో పాటు వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా పండుగ సాయన్న జయంతి

### -తెలంగాణ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన ప్రజా వీరుడు పండుగ సాయన్న
### -జనసేన పార్టీ మక్తల్ నియోజకవర్గం ఇంచార్జ్ డాక్టర్ మణికంఠ గౌడ్





**మక్తల్ నియోజకవర్గ ప్రతినిధి, ఆగస్టు 08 (ప్రజా జ్యోతి):** వెట్టిచాకిరి,అక్రమ పన్నులతో ప్రజలను పీడించే నిజాం భూస్వామ్య వ్యవస్థను ఎదిరించి,పేదలకు అండగా నిలిచి తెలంగాణ రాబిన్ హుడ్‌గా పేరుగాంచి చరిత్రలో నిలిచిన ప్రజా వీరుడు పాలమూరు ముద్దుబిడ్డ పండుగ సాయన్నను ప్రతి ఒక్కరూ ఆయన ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలని జనసేన పార్టీ మక్తల్ నియోజకవర్గం ఇంచార్జ్ డాక్టర్ మణికంఠ గౌడ్ అన్నారు. శనివారం నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో తెలంగాణ రాబిన్ హుడ్ పండుగ సాయన్న జయంతిని పురస్కరించుకొని జనసేన పార్టీ మక్తల్ నియోజకవర్గం ఇంచార్జ్ డాక్టర్ మణికంఠ గౌడ్ ఆధ్వర్యంలో జనసేన పార్టీ కార్యకర్తలతో కలిసి పండుగ సాయన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మణికంఠ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన ప్రజా వీరుడు 1850 నుంచి 1900 మధ్య కాలానికి చెందిన ఈయన ఉమ్మడి పాలమూరు జిల్లా నవాబ్‌పేట మండలం మెరుగోనిపల్లె గ్రామంలో తల్లి సాయమ్మ, తండ్రి అనంతయ్యలకు జన్మించిన ఆ మహనీయుడు వెట్టిచాకిరి,అక్రమ పన్నులతో ప్రజలను పీడించే నిజాం భూస్వామ్య వ్యవస్థను ఎదిరించి, పేదలకు అండగా నిలిచి, తెలంగాణ రాబిన్ హుడ్‌గా ప్రజా వీరుడిగా చరిత్రలో నిలిచిపోయారన్నారు. తెలంగాణ రాబిన్ హుడ్ గా పిలవబడే పండుగ సాయన్న నిజాం నిరంకుశ పాలన కు వ్యతిరేకంగా అణగారిన వర్గాల ఆకలి తీర్చేందుకు ఆనాడు నిజం ప్రభువుల ధాన్యం కారాగాన్ని కొలగొట్టి వాటిని పేదలకు పంచి పెట్టేవాడు అన్నారు. ధనవంతుల నుండి, పెట్టుబడుదారుల వ్యవస్థనుండి భూస్వాముల నుండి, అణగారిన వర్గాలను అణిచివేతకు గురి కాకుండా వారిపై తిరుగుబాటు చేశాడన్నారు. మన పాలమూరు గడ్డపై పుట్టిన పండుగ సాయన్న నిజాం పాలన పై అలుపెరుగని పోరాటం చేశాడని ఆయన చిన్నప్పటి నుండే పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప మహనీయుడన్నారు. ఈ కార్యక్రమంలో మక్తల్ నియోజకవర్గ నాయకులు రామన్ గౌడ్ గౌడి బాల్ రెడ్డి ఉమేష్ కృష్ణ గౌడ్ వీరేష్ మామిళ్ళ అనిల్ లక్ష్మినారాయణ,వీరమహిళలు,డాక్టర్ సబిత లలిత భాగ్య సమ్రీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పండుగ సాయన్న జయంతి వేడుకలు

### -పండుగ సాయన్న విగ్రహ ఏర్పాటుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి



**మక్తల్ నియోజకవర్గ ప్రతినిధి, ఆగస్టు 08 (ప్రజా జ్యోతి):** మక్తల్ ముదిరాజ్ యువకుల ఆధ్వర్యంలో శనివారం నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణ కేంద్రంలోని యాదవ నగర్ చౌరస్తాలో తెలంగాణ రాబిన్ హుడ్ పండుగ సాయన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ముదిరాజ్ సంఘం యువకులు మాట్లాడుతూ అత్యంత ధీరునిగా,సాహసవంతునిగా ఎదిగిన సాయన్న చిన్ననాటి నుంచి అన్యాయాలను ఎదిరించి, పేదల పక్షాన నిలబడ్డాడని, అంతేకాకుండా ప్రజలను దోపిడీ చేస్తున్న భూస్వాములకు ఎదురు తిరిగి అక్రమంగా దోచుకున్న ధాన్యాన్ని, ధనాన్ని తన దగ్గర దాచుకోకుండా పేదలకు పంచి పెట్టిన వీరుడు అని కొనియాడారు. మా అందరికి ఆదర్శ దైవమైన ముదిరాజ్ పులిబిడ్డ తెలంగాణ రాబిన్ హుడ్ పండుగ సాయన్న విగ్రహ ఏర్పాటుకు ప్రతి ఒక్కరు కూడా ముందుకు రావాలని, జయంతి వచ్చిన రోజే ఆయనను స్మరించుకోవడం కాదు ఆయన విగ్రహ ఏర్పాటు కూడా మక్తల్ నియోజకవర్గ ముదిరాజ్ బిడ్డలు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం అంజి, మామిళ్ళ అంబ్రేష్,రాజు,తిరుపతి రమేష్, విజయ్, కుర్వ అంజి,కావలి ప్రవీణ్,రామకృష్ణ, వెంకటేష్ తదితర ముదిరాజ్ యువకులు పాల్గొన్నారు.

## పీడీఎస్ బియ్యం పట్టివేత

**వడ్డేపల్లి ఆగస్టు 08(ప్రజా జ్యోతి):** పట్టణంలోని బృందావన కాలనీలో అక్రమంగా నిల్వ చేసిన 14 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని శాంతినగర్ పోలీసులు శనివారం పట్టుకున్నారు.విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు గోగినేని సత్యనారాయణ ఇంటి ముందు ఉన్న రేకుల షెడ్డుపై దాడి చేసి తనిఖీలు నిర్వహించగా 29 బస్తాల్లో పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు.బస్తాలపై పీడీఎస్ ముద్రలు ఉండటంతో బియ్యాన్ని సీజ్ చేశారు.పోలీసుల ప్రాథమిక విచారణలో ఈ బియ్యాన్ని తెలుగు భాస్కర్, వడ్డే గోపీచంద్ అనే వ్యక్తులు నిల్వ చేసినట్లు తేలిందని తెలిపారు.వడ్డేపల్లి గ్రామ శివారులోని గ్రామాల నుంచి పేదల వద్ద తక్కువ ధరకు పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి,కర్ణాటకలోని రాయచూర్‌లో అధిక ధరకు విక్రయిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.ప్రభుత్వం పేదలకు సబ్సిడీపై అందించే బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి నిల్వ చేసి అధిక ధరకు విక్రయిస్తున్నారనే ఆరోపణలపై శాంతినగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగశేఖర్‌రెడ్డి తెలిపారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేయడం,రవాణా చేయడం,విక్రయించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



## డ్రగ్స్, గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు

**చిన్నంబావి, ఆగస్టు 8 (ప్రజాజ్యోతి)**

మండల పరిధిలో డ్రగ్స్, గంజాయి మహమ్మారిని పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యంగా పోలీసులు శనివారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఎస్ఐ రామన్‌గౌడ్ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ సిబ్బంది, జాగిలం సహాయంతో మండలంలోని రహదారి వెంట ఉన్న హోటళ్లు, కిరాణా, మెడికల్ షాపులు తదితర ప్రాంతాల్లో విస్తృతంగా సోదాలు చేపట్టారు. మత్తు పదార్థాల రవాణా, నిల్వ, విక్రయాలు జరుగుతున్నాయా అనే కోణంలో అనుమానాస్పద ప్రాంతాలను నిశితంగా పరిశీలించారు.యువత, విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తున్న గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని నార్కోటిక్ స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ గోపాల్ హెచ్చరించారు.మండలంలో ఎక్కడైనా మత్తు పదార్థాల విక్రయాలు, అక్రమ రవాణా లేదా అనుమానాస్పద వ్యక్తుల కదలికలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. తనిఖీల్లో హెడ్ కానిస్టేబుళు గోపాల్, ప్రవీణ్, చిన్నంబావి హెడ్ కానిస్టేబుల్ మహేశ్వర్, అశోక్, వాజిద్, డాగ్ స్క్వాడ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

